క్లుప్తంగా

చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి బాలుడి అప్పగింత

మానవపాడు: మండల కేంద్రంలో చెరుకు రసం విక్రయిస్తున్న మైనర్ బాలుడిని శుక్రవారం మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. గత రెండు రోజుల క్రితం స్థానికంగా 7వ తరగతి చదువుతున్న బాలుడు చెరుకు రసం అమ్ముతుండగా కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. తిరిగి మళ్లీ చెరుకు రసం అమ్ముతుండగా.. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందుకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో అధికారులు, పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత

ధరూరు: ఆయా సందర్భాల్లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితులకు ఎస్‌ఐ శ్రీహరి శుక్రవారం అందజేశారు. సీఈఐఆర్ వెబ్ పోర్టల్ ద్వారా కనిపెట్టి ముగ్గురు బాధితులకి ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. సైబర్ నేరాలు, దొంగల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

ధరూరు: వాహన తనిఖీల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో దోపిడీ

అయిజ: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌కు కూతవేట దూరంలో ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఐదు మంది వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి బొలెరో వాహనంలో వచ్చి పెట్రోల్ బంకులో పనిచేస్తున్న సిబ్బందికి కత్తులు చూయించి బెదిరించారు. సిబ్బంది వద్ద రూ.25 వేలు నగదు, మూడు సెల్‌ఫోన్లు, డీవీఆర్‌ను తీసుకొని పారిపోయారు. పోలీసులు శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజీ పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేడుకలు జయప్రదం చేయండి

గద్వాలటౌన్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఆకేపోగు రాంబాబు కోరారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో పూలే జయంతి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పూలే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మణికుమార్, శశివర్మతేజ, కోళ్ల మోహన్‌రాజు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, హౌసింగ్ ఏఈ ప్రకాశ్ పరిశీలించారు. గ్రామంలో మంజూరైన 175 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో నిర్మించాలి

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం డీఈఈ నరేందర్ పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలన్నారు. అనంతరం నిర్మాణాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు బిగిస్తే చర్యలు

మానవపాడు: మిషన్ భగీరథ నీటికోసం మోటర్లు బిగిస్తే కేసు నమోదు చేస్తామని మిషన్ భగీరథ ఏఈ రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో మిషన్ భగీరథ నీటికి మోటార్లు బిగించిన వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం మోటార్లు ఏర్పాటు చేసిన వారిపై పోలీసు స్టేషనలో వారిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తివేయాలి

గద్వాల: కనీస మద్దతు ధరల చట్టం, పలు సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ సరిహద్దులో ధర్నా, నిరసనలు చేసిన 350మంది రైతులపై పంజాబ్ ప్రభుత్వం పెట్టిన పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ స్థానిక వైఎస్సార్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో జి.గోపాల్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

డివైడర్, లైటింగ్ పనులు పూర్తయ్యేనా?

- ఏడాదిన్నర కాలంగా ప్రజలకు ఇబ్బందులు
- బిల్లు రాక పనులు నిలిపేసిన కాంట్రాక్టర్
- రోడ్డు తవ్వి వదిలేసిన పరిస్థితి



శాంతినగర్‌లో డివైడర్ ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపై అటు ఇటు తిరుగుతున్న ప్రజలు(ఫైల్)

శాంతినగర్: నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి చెందుతుందని, సౌకర్యాలు మెరుగుపడతాయని ఆశించిన వడ్డేపల్లి, శాంతినగర్, పైపాడు వాసులకు నిరాశే మిగిలింది. అభివృద్ధి మాట దేవుడెరుగు అర్ధాంతరంగా వదిలేసిన పనులతో అవస్థలు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిలో డివైడర్ కం సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు 2023లో టీయూఎఫ్ఐడీసీ పథకం ద్వారా రూ.3 కోట్లు మంజూరు చేశారు. పట్టణంలో డివైడర్, మధ్యలో లైట్లు ఏర్పాటు చేస్తే ఇరువైపుల దుకాణదారులకు పట్టణ ప్రజలకు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని సంతోషించారు. ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపుల మట్టి తవ్వి కంకర వేశారు. అప్పటి వరకు చేపట్టిన పనులకు సంబంధించి బిల్లు పెట్టగా ఏడాదిన్నర అయినా బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు ఆపేశాడు. దీంతో పట్టణ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కంకరతో తరచూ ప్రమాదాలు..

శాంతినగర్ పట్టణంలోని ప్రధాన కూడలిలో డివైడర్ ఏర్పాటు చేయకపోవడం, కంకర వేసి వదిలేయడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డుపై కాలినడకన వెళ్లాలంటేనే అవస్థలు పడుతున్నారు. వారాంతపు సంత శుక్రవారం రోజు పరిస్థితి అధ్వాన్నంగా ఉంటుంది. తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం, రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. కంకర రోడ్డును బీటీగా మార్చి పట్టణంలో సమస్యలు పరిష్కరించాలంటున్నారు.మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తిచేసి పట్టణంలో సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



రద్దీగా శాంతినగర్ రహదారి(ఫైల్)

పనులు పూర్తి చేయాలి



ఏడాదిన్నర క్రితం లైటింగ్ సిస్టం మొదలు పెట్టారు. రోడ్డు తవ్వి వెడల్పు చేసి కంకర వేసి వదిలేశారు. కంకరపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. రోడ్డు పనులు పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలి.

– వెంకట్రాముడు, శాంతినగర్

తరచూ ప్రమాదాలు



శాంతినగర్ సెంటర్‌లో డివైడర్ ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఐలమ్మ విగ్రహం నుంచి రవీంద్ర పాఠశాల వరకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– పక్కీరప్ప, శాంతినగర్

త్వరలో పనులు మొదలుపెడతాం..

కాంట్రాక్టర్ చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. రెండు రోజుల క్రితం బిల్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు మొదలు పెట్టి డివైడర్, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుకు కృషిచేస్తాం.

– మేఘనాథ్, ఇన్‌చార్జ్ ఏఈ, వడ్డేపల్లి

కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ హేమలత

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని మల్దకల్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమలత అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకే కేంద్రాలు నిర్వహించాలన్నారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీతో పాటు ఆరోగ్యం గురించి జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, వాసంతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రవల్లి: టీజీఆర్‌జేసీ సెట్– 2025 ప్రవేశాలకు పదో తరగతి పూర్తి చేసిన బాలురు దరఖాస్తు చేసుకోవాలని బీచుపల్లి గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ గ్రూపుల్లో చేరుటకు ప్రవేశ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 రుసుముతో ఏప్రిల్ 23తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష మే 10న ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 040– 24734899ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అంబులెన్స్ అయినా ఆగాల్సిందే..



రహదారి మధ్యలో నిలిచిన 108 వాహనం(ఫైల్)

శాంతినగర్: వడ్డేపల్లి– రాజోళి ప్రధాన రహదారిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు వాపోతున్నారు. చివరకు అంబులెన్స్ అయినా ఆగాల్సిందేనని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్ నుంచి వడ్డేపల్లి మీదుగా రాజోళిని కలిపే ప్రధాన రహదారి పనులను రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ ప్రారంభించారు. పాత రోడ్డును తొలగించి కంకర పోసి వదిలేశాడు. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో అటు కర్నాటక, ఇటు తెలంగాణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రద్దీగా ఉండే రహదారిని పూర్తి చేయకపోవడంతో పట్టణ ప్రజలతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటు చేసుకోవడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు. అంతేగాక రహదారి సమీపంలోని ఇళ్లలో ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రోడ్డు పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చర్చి పాస్టర్ల ర్యాలీ

అయిజ: రాజమండ్రి వద్ద ఇటీవల జరిగిన పాస్టర్ పగడాల ప్రవీణ్‌ది యాక్సిడెంట్ కాదని, కుట్రపూరితంగా చేసిన హత్య అని ఆరోపిస్తూ చర్చి పాస్టర్లు మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వివిధ చర్చిల పాస్టర్లతో పాటు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎస్సీ కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సంఘటనపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, సంఘాల నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

కేటీదొడ్డి: విధి నిర్వహణలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని శుక్రవారం పాతపాలెం, ఈర్లబండ, గంగన్‌పల్లి పాఠశాలల్లో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీఆర్పీ, పాపయ్య పాల్గొన్నారు.

అగ్గిపాలవుతున్న హరితహారం మొక్కలు



ఇటిక్యాల: గత ప్రభుత్వం పల్లెల్లో పచ్చదనం పెంచాలనే సంకల్పంతో కోట్లు ఖర్చుచేసి హరితహారంలో భాగంగా పల్లె రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటించింది. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు రైతులు తమ పొలంలోని చెత్తను కాలుస్తుండగా మంటలు సమీపంలోని హరితహారం మొక్కలకు అంటుకోవడంతో అవి పూర్తిగా కాలిపోతున్నాయి. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై మునుగాల గ్రామ సమీపంలోని మొక్కలు ఆగ్నికి ఆహుతయ్యాయి. స్థానిక పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌ను సాక్షి వివరణ కోరగా.. గుర్తుతెలియని వ్యక్తులు మొక్కలకు నిప్పంటించారని, అట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



అమరవాయిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న నాయకులు, అధికారులు, మతపెద్దలు



అలంపూర్‌లో ఇఫ్తార్‌లో తహసీల్దార్, నాయకులు

మానవపాడు: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని డీసీసీ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ అహ్మద్ అన్నారు. మండలంలోని అమరవాయిలోని మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విందులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విందులో ఎంపీడీఓ భాస్కర్, ఏఈ రాఘవేంద్ర, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్: పట్టణంలో ప్రభుత్వం తరఫున శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక సబ్జీ మండి మసీదులో తహసీల్దార్ మంజుల ఆధ్వర్యంలో విందు ఇచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మసీదుల్లో ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలిశ్రీనివాసులు, రాష్ట్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు మహ్మద్ ఇస్మాయిల్, మాజీ జెడ్పీటీసీ మద్దిలేటి పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని మసీదులో పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మతపెద్ద ఇక్రమ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు మసీద్ ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పోతురాజు సోమనాద్రితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

ఎర్రవల్లి: మండల పరిధిలోని కారుపాకుల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ.. రూ.5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహ, కృష్ణయ్య, మద్దిలేటి, బీసన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమాదేవి

గద్వాలన్యూటౌన్: బాల్య వివాహం చేయడం, ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ ఉమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ, సంక్షేమంపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ బాల్య వివాహాల వలన ఉత్పన్నమయ్యే సమస్యల గురించి వివరించారు. బాల కార్మిక వ్యవస్థతో పిల్లల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. డీసీపీఓ నర్సింహ మాట్లాడుతూ.. బాలలపై శారీరక, మానసిక, లైంగిక వేధింపుల నుంచి రక్షణకు 1098 సమాచారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, పంచాయతీ కార్యదర్శి సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ రహ్మత్ బాషా, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ఎర్రవల్లి: గొర్రెలు, మేకల్లో వచ్చే అమ్మతల్లి వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్య అధికారి డాక్టర్ భువనేశ్వరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొండేరులో దాదాపు 800 గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వైరస్ వల్ల అమ్మతల్లి వ్యాధి సోకుతుందన్నారు. వ్యాధి సోకిన జీవుల్లో జ్వరం, కంటి ముక్కు స్రావాలు ఉండటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడటం , శరీరమంతా బొబ్బలు ఏర్పడటం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. దీంతో మేత తీసుకోకుండా నీరసించి జీవాలు అధిక సంఖ్యలో చనిపోతాయన్నారు. వ్యాధి సోకిన జీవాల నుంచి ఇతర జీవాలకు ప్రత్యక్షంగా వైరస్ సోకుతుందన్నారు. వ్యాధి సోకిన జీవాలను వేరుచేసి లక్షణాలను బట్టి తగిన వైద్యం అందించాల్సి ఉంటుదన్నారు. కావునా మూడు నెలల వయస్సు పైబడిన అన్ని జీవాలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ్ భాస్కర్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, వెంటనే అగ్రిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకుడు గోపాల కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ జ్యోతికి బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో తరుచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఫైర్ ఇంజిన్ ఇతర మండలాల నుంచి సంఘటనా స్థలానికి చేరుకోవడానికి సుమారు గంట సమయం పడుతుందని అన్నారు. దీంతో పెద్దఎత్తున ఆస్తినష్టం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, మహేష్, లక్ష్మణ్ గౌడ్, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మా ప్లాట్లు అప్పగించండి సారూ..



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మానవపాడు: మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా సమయంలో మంజూరు చేసిన ప్లాట్లు అప్పగించాలని మానవపాడుకు చెందిన లబ్ధిదారులు జలీల్, ఆంజనేయులు, అల్లిసా, బీసన్న, పరుశరాముడు శుక్రవారం తహసీల్దార్ జోషి శ్రీనివాస శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మానవపాడులోని బాపనోళ్ల చేనులో సర్వే నంబర్ 285, 298, ప్రొసీడింగ్ నం. 8/4/1993 సంవత్సరంలో ప్రభుత్వం తరుపున 56 ప్లాట్లు మంజూరు చేశారు. అప్పటి నుంచి హద్దులు గానీ, ప్లాట్ల నంబర్లు గానీ ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు దయవుంచి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీ జాప్యంపై ఆందోళన



ఆందోళన చేస్తున్న దరఖాస్తు దారులు

గట్టు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం పలువురు దరఖాస్తు దారులు ఆందోళనకు దిగారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆందోళన చేపట్టారు. కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నట్లు బాధితులు ఆరోపించారు. అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ సర్టిఫికెట్ల జారీలో కాలయాపన చేస్తున్నట్లు ఆరోపించారు. అధికారులు స్పందించి సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన వెంకటేష్ రెండు నెలల క్రితం జీవనోపాధి నిమిత్తం కేటీదొడ్డి మండలం నందిన్నె గ్రామంలో మామిడి తోటను గుత్తకు తీసుకుని కుటుంబ సభ్యులతో కలసి అక్కడే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని దుండగులు శుక్రవారం ఉదయం వెంకటేష్ ఇంటి తలుపులు ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించిన స్థానికులు సదరు వ్యక్తికి సమాచారం అందించారు. ఈ క్రమంలో వెంకటేష్ తన ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాను పగులగొట్టి అందులోని మూడు తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరించినట్లు గుర్తించి పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న నాయకులు

కేటీదొడ్డి: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంలాంటివని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారులకు చెక్కులను క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు పరిచి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, నాయకులు సుభాన్, ఉరుకుంద, పాండు, టీచర్ గోవిందు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘పది’ పరీక్షలు



ఇటిక్యాలలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఎర్రవల్లి: మండలంలో శుక్రవారం జరిగిన పదో తరగతి భౌతిక రసాయనిక పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 409 మంది విద్యార్థులకుగాను ఒక్క విద్యార్థి గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి అమీర్‌పాష తెలిపారు. కోదండాపురంలో 126, కొండేరులో 146, ఎర్రవల్లిలో 136 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

వందశాతం హాజరు

ఇటిక్యాల: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షకు వందశాతం విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.